

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



– 26 –

పోయిన నెల కథ సంక్షిప్తంగా:

***మధుర ఒక మధ్య తరగతి అమ్మాయి. తండ్రి అనారోగ్యంతో ఉన్నపుడు సహాయం అడగడానికి , బాగా డబ్బున్న బంధువైన శర్వాణి దగ్గరకు వెళ్తుంది. శర్వాణి, ఆమెకు సహాయపడుతూనే, మధుర జీవితంలో ఒక సంవత్సరం తనకోసం కావాలంటుంది.***

***తరువాయి భాగం చదవండి.***

**రాత్రి ఆలస్యంగా** నిద్రపోయినా, కొన్నిసార్లు ఉదయమే మెలకువ వచ్చేస్తుంది.

నిద్రలేవగానే , మధురకు, తండ్రికి జరగబోయే ఆపరేషన్ విషయం గుర్తొచ్చింది. ‘ఏమవుతుందో. ఎలా జరుగుతుందో’ అనుకుంటూ లేచి తయారవుతూ ఉంటే, శర్వాణితో జరిగిన సంభాషణ గుర్తొచ్చింది.

‘తన జీవితంలో ఒక సంవత్సరం ఇవ్వడమేమిటి?’

అదేమిటో ఆపరేషన్ అయ్యాక ఆలోచిద్దాంలే అని, ఆ విషయం పక్కన పెట్టేసింది.

ఇంటికి తాళం పెట్టి బయటికి వచ్చింది.

బయట తనకోసం ఒక కార్ సిద్ధంగా ఉంది.

ఆటోలో వెళ్తానని చెప్పడానిక్కూడా అవకాశమివ్వనంత గంభీరంగా ఉంది డ్రైవర్ మొహం.

తండ్రి దగ్గరకు వెళ్ళే సరికి ఇద్దరు డాక్టర్లు, ఇంకా నర్సులు ఆయనకు ధైర్యం చెప్తున్నారు. కౌన్సెలింగ్ చేస్తున్నారు. కూతురిమొహంలో దిగులు చూసి ఆయన చిరునవ్వు నవ్వబోయాడు. ఆమెను దగ్గర కూర్చోబెట్టుకుని ఏదో చెప్దామనుకున్నాడు . వీలు చిక్కలేదు. రూం నుండి తీసుకెళ్ళబోయే సమయం లో ఆమె చేతిని గట్టిగా పట్టుకుని

"ఏం భయం లేదమ్మా" అనగలిగాడు.

ఇద్దరి కళ్ళూ నిండాయి.

తండ్రిని లోపలికి తీసుకుని వెళ్ళాక, ఒక్కతే ఆపరేషన్ థియేటర్ ఎదురుగా కూర్చుంది.

దగ్గర్లో శర్వాణి నియమించిన మనుషులు ఉన్నారు. ఆమె కదలగానే దగ్గరకొచ్చి ఏమైనా కావాలేమో కనుక్కుంటున్నారు.

నాలుగు గంటల తర్వాత సర్జరీ చేసిన డాక్టర్ బయటికి వచ్చి , మధురతో ఆపరేషన్ బాగా జరిగిందని చెప్పి, ఎలా జరిగిందో వివరంచారు. సాధారణంగా ఎలాంటి సమస్యలు రావొచ్చో, ఒకవేళ ఎలాంటి ఇబ్బందులూ లేకపోతే ఇంటికెపుడు పంపిస్తారో చెప్పారు.

నాలుగైదురోజుల్లో ఆయన పూర్తిగా కోలుకున్నాడు. డాక్టర్లు, మిగిలిన సిబ్బంది ఎంతో శ్రద్ధగా చూస్తున్నారు.

తండ్రి బలహీనంగా ఉన్నాడు , కానీ ఆరోగ్యంగా తిరుగుతున్నాడు.

తను బాగానే ఉన్నానని మధురకు అనిపించడానికి సంతోషంగా కనిపించే ప్రయత్నాలు చేస్తున్నాడు.

రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తారనగా శర్వాణి చూడడానికి వచ్చింది. మధుర తండ్రి ఆమెను పెద్దకూతురి హోదాలో చూస్తున్నాడు. ఆమె కూడా అందుకు తగ్గట్టే ప్రవర్తిస్తోంది.

ఆ డాక్టర్లంతా అంత జాగ్రత్తగా చూసుకోవడం, అలాంటి హాస్పిటల్ లో వైద్యం, తనింకో జన్మెత్తినా నాన్నకు చేయించలేదు. శర్వాణి పట్ల  మనసంతా కృతజ్ఞతతో నిండిపోయింది. ఆమె చేసిన సహాయానికి జన్మంతా సేవ చేసినా సరిపోదు.

అలా అనుకుంటున్నపుడే శర్వాణి లోపలికి వచ్చింది. ఆమె ఎప్పుడు వచ్చినా సరే, మామూలుగా ఉన్న పరిసరాలు అప్పటికప్పుడు మారిపోతాయి. వింతలోకం లో ఉన్న అనుభూతి కలుగుతుంది. ఆమె నుండి  ఎవరూ చూపు తిప్పుకోలేరు. సంభ్రమంగా చూడడం తప్ప!

ఆమెతో వచ్చిన డాక్టర్లు , ఆయన ఆరోగ్యస్థితి గురించి వివరంగా చెప్పి, ఇక ఇంటికి తీసుకువెళ్ళొచ్చని చెప్పారు.

వాళ్ళు వెళ్ళిపోయాక పినతండ్రి తో అప్యాయంగా మాట్లాడింది. ఇక నుండి ఏ అవసరమొచ్చినా తనకే కబురు చెయ్యాలని ఒట్టేయించుకుంది. మధు బాధ్యత అంతా తనదే అన్నది.

ఆయనకెంతో సంతోషంగా ఉంది.

వెళ్ళబోయే ముందు, "బాబాయ్, మధుని ఇవాళ మా ఇంటికి తీసుకెళ్తాను" అనుమతి అడుగుతున్నట్టే చెప్పింది.

మధుర గుండె వేగంగా కొట్టుకుంది.

తండ్రి వంక చూసింది.

"వెళ్లమ్మా, నాకెటూ నిద్రొస్తోంది."

ఆమె వెంట వెళ్ళింది. నల్ల కార్ పార్క్ చేసి ఉంది. ఎప్పటిలానే డ్రైవర్ లేడు. లోపల కూర్చున్నాక చూస్తే , దాన్ని కార్ అనలేనంత పెద్దగా ఉంది. దారిలో శర్వాణి మాట్లాడుతుందేమోనని చూసింది. ఆమె మౌనంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్తోంది. సాయంత్రం కావొస్తున్నా ఇంకా ఎండగానే ఉంది.

తన బంగళాకు తీసుకెళ్తుందేమోనని అనుకుంది కానీ, కార్ ,ఒక గేటెడ్ కమ్యూనిటీ లోపలికి వెళ్ళింది. అక్కడ అన్నీ ఒకే రకమైన విల్లాలు ఉన్నాయి. ఇంటికీ, ఇంటికీ మధ్యన చాలా దూరం, పచ్చికబయళ్లు. ప్రతి ఇంటికీ ముందు భాగంలో చిన్న కొలను, దాని చుట్టూ తోట కనిస్తున్నాయి. ఎక్కడ చూసినా చిన్న చిన్న పొదలలాంటి చెట్లూ, వాటి నిండా విరబూసిన రంగు రంగుల పూలు.  కార్ ఒక ఇంటి ముందు ఆగింది. డోర్ బెల్ కొట్టగానే ఒకావిడ తలుపు తీసింది. శర్వాణిని చూసి వినయంగా నమస్కారం చేసి పక్కకు తప్పుకుంది. లోపలికి వెళ్లగానే ఏసీ చల్లదనం మొహానికి హాయిగా తగిలింది.

ఎన్నో విశాలమైన గదులున్నాయి. ప్రతి గదిలోనూ ఖరీదైన ఫర్నిచర్. అవి కూడా చాలా తక్కువగా ఉన్న ఫర్నిచర్. కంటికి శ్రమ కలిగించని గోడలకు లేత రంగులు.

"స్నానం చెయ్యి మధూ."

"ఇంటికి వెళ్తాను" అక్కా అన్న పిలుపు కలపాలో వద్దోనని ఆగిపోయింది.

"ఇవాళ ఇక్కడే ఉందాంలే మధూ. ముందు స్నానం చెయ్యి."

ఇవాళ తనతో ఆ సంవత్సరం విషయం మాట్లాడుతుందని అర్థం అయింది.

"మంగమ్మా" అని పిలిచింది. ఇందాక తలుపు తీసినావిడ వచ్చింది.

"అమ్మాయికి తన రూం చూపించు." ఆవిడ తనతో పాటు హాల్లో ఉన్న మెట్ల మీదుగా తీసుకెళ్ళింది. పైన , నాలుగైదు గదులున్నాయి. అక్కడ కూడా గోడలకు పెయింటింగ్స్ ఉన్నాయి కానీ, పాలెస్ లో పెయింటింగ్స్ అంత భారీగా లేవు. చక్కటి ప్రకృతి చిత్రాలు తగిలించి ఉన్నాయి.

తన రూం ఏమిటి అనుకుంటూ గదిలోకి వెళ్ళాక , అక్కడ ఆమెకవసరమైన వస్తువులు, బట్టలూ అన్నీ చక్కగా సర్ది ఉన్నాయి. ఇవి తనకోసమా అని ఆశ్చర్యపోయింది.

వాటిని చూశాక మనసులో ఏదో అసౌకర్యం కలిగింది.

ఉచితంగా పొందవలసి వస్తే, మనసులో కలిగే అసౌకర్యం!

'ఇలా ఉపకారాలు పొందడం కష్టంగా ఉంది. ఆమెకు బదులు తీర్చేయాలి. సంవత్సరం పాటు ఆమె అడిగినదేదైనా సరే చేసేసి బరువు తీర్చుకోవాలి' అనుకుంటూ స్నానం చేసింది.

సంవత్సరమంతా నాన్న ఎలాగ?

నాన్నకసలే ఆరోగ్యం బాలేదు.

అదొక్కటీ గట్టిగా కనుక్కోవాలి.'

ఏవేవో ఆలోచిస్తూ కిందకు దిగి వచ్చేసరికి సాయంత్రం, రాత్రిగా మారింది.

నాన్నని బతికించి ఎంతో సహాయం చేసింది. తీసుకున్నాక మాట తప్పడం అంటే, నాన్న ప్రాణం మీద గౌరవం లేనట్లే. అలా ఎన్నటికీ చెయ్యదు.

జీవితం లో ఒక సంవత్సరం!

అంటే ఏమిటి?

సినిమాలు గుర్తొచ్చాయి.

మధుర ముందుగా తట్టిన ఆలోచన చాలా భయం వేసింది.

ఊహలెంత దడిపిస్తాయి. వాటికే శక్తి ఉంటే, ప్రపంచంలో తాళ్ళు మిగలవు. పాములై పరుగులు తీస్తాయి.

ఇంటి వెనక వైపు ఒక చిన్న స్విమ్మింగ్ పూల్ ఉంది. ఉంది. వరండా నుండి పూల్ వరకూ వెళ్ళడానికి ఏడెనిమిది విశాలమైన మెట్లు ఉన్నాయి. మెట్లకు రెండు వేపులా పూలతీగెలు. తీగెలకున్న తెల్లని పూలు వెన్నెలలో వికసించాయి.

స్నానం చేసి వచ్చి ఆ మెట్ల మీద కుర్చుంది. తెల్లని గార్డెన్ లైట్ వెలుగు మెట్లమీద పడుతోంది.

పూలపరిమళం ఆమె చుట్టూ అలముకుంది.

చదువుకోడానికెంత బాగుందీ చోటు!

తన బుక్స్ ఉంటే తెల్లవారే వరకూ చదువుకోవచ్చు! అనుకుంది.

పరీక్షలు ఇంకా ఎంతో దూరం లేవు.

ఆలోచిస్తూ ఉంటే , అలికిడికి వెనక్కి తిరిగి చూసింది. ముదురు నీలం రంగు షిఫాన్ చీరలో శర్వాణి పై మెట్టు మీద నిలబడి ఉంది. నీలి మబ్బుల్లో చక్కటి చందమామలా ఉంది ఆమె.

ఆమెను ఎంత సేపు చూసినా తనివి తీరదు.

"మీరు చాలా బాగుంటారక్కా." సంతోషంగా అంది.

ఎప్పటి నుండో చెప్పాలనుకున్న విషయం లా చెప్పింది. శర్వాణి నవ్వింది.

లోపల్నుండి వంట మనిషి, పని మనిషి వచ్చారు. స్విమ్మింగ్ పూల్ దగ్గర భోజనానికి ఏర్పాటు చేశారు.

భోజనాలు అయాక పనివాళ్ళు లోపలికి వెళ్ళిపోయారు.

ఎక్కువ ఉపోద్ఘాతం లేకుండా విషయం చెప్పడం మొదలుపెట్టింది శర్వాణి.

"మధూ, నేనున్న పరిస్థితుల్లో నిన్ను తప్ప ఇంకెవరినీ సాయం అడగలేను. నిన్ను ఇబ్బంది పెడుతున్నాను,"

"అక్కా, మీరు చేసిన సహాయానికి జన్మంతా సేవ చేసినా సరిపోదు. మీరు ఏం చెయ్యమన్నా చేస్తాను. నాన్న క్షేమంగా ఉంటే చాలు. "

"బాబాయిని జాగ్రత్తగా చూసుకునే బాధ్యత నాది. నువ్వు సరే అని ఒప్పుకుంటే అంటే రేపే బాబాయిని ఈ ఇంటికి తీసుకొద్దాం. ఈ ఇల్లు, పనివాళ్ళు ఏర్పాటు చేసింది అందుకోసమే."

"నాన్న ఇక్కడా? ఇలాంటి పరిసరాల్లో మేము ఎప్పుడూ ఉండలేదు."

"ఆలోచించే తీసుకున్నాను మధూ. ఇక్కడైతే సీనియర్ సిటిజెన్స్ కోసం క్లబ్, లైబ్రరీ , మెడికల్ హెల్ప్ అన్నీ ఉన్న ఇలాటి చోట విల్లా దొరకడం అదృష్టం."

'ఉచితంగా పొందేదాన్ని అదృష్టం అంటారా?'

ఇన్ని ఏర్పాటు చేసిందంటే, అడగబోయే విషయమేమిటో?

శర్వాణి చెప్తుంటే శ్రద్ధగా వింటోంది.

"మధూ అందరూ కోరుకునే జీవితం నాది. పెళ్లయి ఇరవై ఏళ్ళవుతున్నా పిల్లలు లేరు. పిల్లలు లేని కారణం వల్ల, ఇంకా రెండు సంవత్సరాల్లో కొన్ని మార్పులు రాబోతున్నాయి. అవే గనక జరిగితే నా పరిస్థితి చాలా కష్టం అవుతుంది. నాకంటూ వారసులు కావాలి. తప్పనిసరిగా పిల్లలు కావాలి.

నాకు ఇక పిల్లలు పుట్టే అవకాశం లేదని డాక్టర్లు చెప్పారు. నా చుట్టూ చాలా మంది ఉన్నారు. కానీ నా అనుకునే నమ్మకమైన వాళ్లే కావాలనుకున్నాను. నిన్ను మొదటి రోజున చూసినపుడు, దేవుడే నా దగ్గరకు పంపాడని అనుకున్నాను. నువ్వే నన్ను రక్షించాలి మధూ. ప్లీజ్." మధుర చేతులు పట్టుకుంది.

చల్లని వెన్నెల్లో శర్వాణి చేతులు వెచ్చగా ఉన్నాయి.

"నేనేం చెయ్యగలనక్కా?"

"నాకో బిడ్డని కని ఇవ్వాలి."

"బిడ్డని కనడమా? అంటే పెళ్ళిచేసుకోవాలా? నేనింకా సెటిల్ కాలేదు. ఇప్పుడు పెళ్ళి అంటే"

"పెళ్ళి అవసరం లేదు."

పెళ్ళిలేకుండా బిడ్డ ??? మరీ భయంగా తోచింది.

“అంటే? నా భయం” అంటూ ఆగింది. శర్వాణి ఆమెను చెప్పనిచ్చింది.

మధుర కాసేపాగి, “నన్నెవరూ ముట్టుకోగూడదు, మగవాళ్లంటే నాకు చాలా భయం.”.

“పిచ్చి పిల్లా . నిన్నెవరూ ముట్టుకోరు. సరేనా. సైన్స్ ఎంతో ముందుకెళ్ళింది.”

ఆమెకెలాంటి ఇబ్బంది లేకుండా, తేలిక పద్ధతుల్లో గర్భం వచ్చే విషయాలు వివరించింది. ఒక సంవత్సరం పాటు ఆమె అజ్ఞాతంలో ఉంటుందనీ, బిడ్డని కని ఇవ్వడం అనేదంతా చాలా రహస్యంగా జరుగుతుంది. కనక తను భయపడాల్సిన అవసరం లేదని చెప్పింది.

"అన్నీ సవ్యంగా జరిగితే , ఈ ఇల్లు బాబాయికి ఇచ్చేస్తాను, జీవితాంతం ఆయన వైద్యం గురించి నేనే చూసుకుంటాను. సంవత్సరం తర్వాత నువ్వు , నీ జీవితం అంతా నీ ఇష్టం. "

ఆమె పొందబోయే మిగిలిన ప్రయోజనాల గురించి చెప్తూ, “రేపు ఉదయం నాకే విషయం చెప్తే చాలు. కాదని చెప్పినా నేనేమీ అనుకోను.” చెప్పింది శర్వాణి.

ఎదుటివారు తప్పకుండా , అవునని జవాబు చెప్తారని నమ్మకం కలినపుడే ఆ అవకాశం ఇస్తుందామె.

ఈ రూల్స్ అన్నీ చదువుకో. అంటూ కొన్ని పేపర్లు ఇచ్చింది.

బందీ అయాక , బోనుకెన్ని ఊచలున్నాయో లెక్కబెట్టడం వల్ల ఏం ప్రయోజనం?

ఆమె తన గదికి వచ్చాక ఆ పేపర్లను పక్కన బెట్టింది.

పడుకుంది కానీ, నిద్రపట్టడం లేదు.

నిద్రకోసం ప్రయత్నిస్తూ కిటికీ నుండి బయటికి చూసింది. నీలంగా ఉన్న ఆకాశంలో చుక్కలన్నీ చూస్తున్నాయి.

దూరంగా బయట గార్డెన్ లో ఒక మందిరం కనిపించింది. మందిరం లో లైట్లు ప్రకాశంగా వెలుగుతున్నాయి.

పాలరాతి కృష్ణుడు పసుపురంగు పట్టు వస్త్రం కట్టుకుని వున్నాడు. చప్పుడు కాకుండా బయటికి వెళ్ళింది. ఆ మందిరపు మెట్ల మీద కూర్చుంది.

‘ఏమిటిది, ఇలా అయింది?’

‘సమస్యలు ఇలా కూడా ఉంటాయా?’

‘ఏం చెయ్యాలిపుడు?’

తండ్రికి చెప్పాలా?

చెప్తే తట్టుకుంటాడా? ఆయనిపుడెంతో ప్రశాంతంగా ఉన్నాడు. ఈ చక్కటి పరిసరాల్లో మరింత ప్రశాంతంగా గడపాలి.

ఏమైంది, ఒక్క సంవత్సరం తనది కాదు.

బిడ్డను కంటుంది.

వాళ్ళకిచ్చేస్తుంది.

అదెటూ రహస్యంగానే ఉంటుంది.

తనకేమీ పెళ్ళి మీద ఆశలు లేవు. ఆ సంవత్సరం పాటు వృధా చెయ్యకుండా తను పరీక్షలు పూర్తిచేసుకుంటుంది. ఆ తర్వాత నాన్న హాయిగా ప్రశాంతంగా రిటైర్డ్ లైఫ్ గడుపుతాడు.

మనం బాగా భయపడతామనుకున్న విషయాలు, వాస్తవంలో మామూలుగా జరిగిపోతాయి. అవి జరిగినపుడు పెద్ద భయం కూడా వెయ్యదు.

నిశ్చలంగా ఉంది మనసు సరసు.

నిర్ణయాలు తీసుకోవడం తెలియని వారికే అన్ని సమస్యలూ.

లేచి నిలబడింది. చల్లగాలికి చున్నీ ఎగిరిపోతోంది. మందిరం మెట్లు దిగుతూ వెనక్కి తిరిగి కృష్ణుణ్ణి చూసింది.

ఎప్పట్లానే శ్రద్ధగా మురళి వాయిస్తున్నాడు.

“థాంక్స్” చెప్పింది.

నమ్మేవారి కెపుడూ దేవుడు వెంటే ఉంటాడు.

నిర్ణయాలు తీసుకోవడానికి సహాయం చేస్తాడు.

ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ చేసే టైంలో శర్వాణి ప్లాన్ మొత్తం వివరించింది.

“నీకు నచ్చనిది, నువ్వు భయపడేవి ఏమీ జరగవు. మగవాళ్ళెవరూ నీ దగ్గరకు రారు. ప్రెగ్నన్సీ కోసం నాలుగు నెలలు మాత్రమే ప్రయత్నం చేద్దాం. ఆ ప్రయత్నాలు జరిగే టైంలో నువ్వు , మీ నాన్నతో కలిసి ఈ ఇంట్లోనే ఉంటావు. మన ప్రయత్నాలు సక్సెస్ అయి, ప్రెగ్నన్సీ వచ్చాక మూడో నెలలో కొన్ని పరీక్షలు చేయించాలి. లోపలి పిండానికి ఏ లోపమూ లేదని తేలాక, నువ్వొక సంవత్సరం నేను చెప్పిన ప్లేస్ లో ఉండాలి. సివిల్స్ కోచింగ్ కోసమని వేరే పంపిస్తున్నానని చెప్పి. బాబాయిని ఒప్పించే బాధ్యత నాది.”

“థాంక్యూ అక్కా, ఈ సంవత్సరం లో పరీక్షకు కూర్చోలేనేమోనని భయపడ్డాను.”

“మధూ, బాబాయి కోసమే అలా చెప్తాము. పరీక్ష అదీ , నెక్స్ట్ ఇయర్ చూసుకో.”

“మరి ఆ తర్వాత నాకు ఏమని చెప్పాలి?”

“పరీక్ష పోయిందని చెప్పు”

“అబద్ధమా?”

“పోనీ నిజం చెప్తావా?”

"ఊహూ" తలాడించింది.

టీవీ చూస్తున్నాడు ప్రకాష్.

తను టీవీలో కనిపిస్తానని , చూడమని చెప్పి వెళ్ళింది భార్య .

టీ, బిస్కెట్స్ ఉన్న ట్రాలీ జరుపుకుంటూ మెయిడ్ వచ్చింది.

“సార్ , గ్రీన్ టీ.”

టీవీలో చానల్స్ మారుస్తూ. “వాణీ, ఇవాళ కాఫీ తీసుకురా. మిల్క్ కాఫీ చేసి తీసుకురా." చెప్పాడు

అక్కడే నిలబడింది.

ఏంటన్నట్టు చూశాడు.

“మేడం మీకు మిల్క్ ప్రొడక్ట్స్ ఇవ్వొద్దని చెప్పారు . పోనీ బ్లాక్ కాఫీ సార్?”

“వద్దులే, వాటర్ ఇవ్వు”

గ్లాసులో పోసివ్వబోతోంది. ఇలా ఇవ్వు అంటూ బాటిల్ తీసుకున్నాడు.

“సార్ , టీ?”

“తీసుకెళ్ళు."

ఆమె వెళ్ళిపోయింది.

తను బరువు పెరుగుతున్నానని శర్వాణి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటుంది. చాలా విషయాలు తనే ప్లాన్ చేస్తుంది. ఎన్నాళ్ళు పనిచేశాక, ఎన్ని హాలిడేస్ తీసుకోవాలి, ప్రపంచంలో ఎక్కడికి వెళ్లాలి , ఎవరితో వెళ్ళాలి కూడా ఒక ప్రణాళిక ప్రకారం అమలు చేస్తుంది.

టీవీ చానల్ లో పోటీ మొదలైంది.

కోట్ వేసుకున్న ఒక యాంకర్ మాట్లాడుతున్నాడు. “ప్రతి విజయం వెనుకా ఒక స్త్రీ ఉంటుంది. ఈనాడు మనం చూస్తే,

అలా విజయపథంలో నడుస్తున్న పురుషుల వెనక తప్పనిసరిగా స్త్రీ పాత్ర ఉండి తీరుతుంది. పోటీలో నెగ్గిన వారికి, అవార్డ్ తో బాటు.." చెప్పుకుపోతున్నాడు.

ప్రకాష్ టైం చూశాడు.

ఇంకా శర్వాణి కనిపించలేదు. టీవీ మ్యూట్ లో పెట్టి ఫ్రెండ్ కు ఫోన్ చేసి కాసేపు మాట్లాడాడు. మధ్యలో ఒక సారి టీవీ వైపు చూశాడు. శర్వాణి కనిపిస్తోంది.

మొదటి గిఫ్ట్, మొదట కలిసిన ప్రదేశం ఇలా ఏవేవో అడుగుతున్నారు. టక టకా ఆన్సర్లు చెప్తోంది.

పురుషుడి విజయంలో స్త్రీ పాత్ర గురించి చెప్తోంది.

“ఇంట్లోనూ, బయట వ్యాపార ప్రపంచంలోనూ వత్తిడితో నలిగిపోయే భర్తను నిత్యం నీడలా ఎలా కాపాడుకోవాలో, ఆ బాధ్యతల్ని , తనెలా నిర్వర్తిస్తుందో ఉదాహరణలతో వివరించింది. భర్తకు ఎలా సహరిస్తుందో , ఇరవైనాలుగ్గంటలూ భర్తను కంటికి రెప్పలా, ఎలా కాపాడుకుంటుందో చెప్పాక సభికులంతా చప్పట్లు కొట్టారు.

టీవీని మ్యూట్ లో ఉంచి కొన్ని బిజినెస్ ఫోన్ కాల్స్ మాట్లాడాడు. రేపటి బిజినెస్ వ్యవహారలన్నీ చక్కబెట్టాడు.

“సార్!” డిన్నర్ లోకి ఏం కావాలని ఆడగడానికి కుక్ వచ్చాడు.

“నీకు తెలుగు చదవడం వచ్చా?”

వచ్చని తలూపాడు.

పక్కనే ఉన్న నోట్ పాడ్ మీద

"అన్నం, బంగాళా దుంపల వేపుడు, రసం చాలు" అని రాసి ఆ పేపర్ చింపి అతనికిచ్చాడు.

“అరగంట టైం ఇస్తున్నా. త్వరగా."

బద్ధకంగా లేచి అటూ ఇటూ తిరిగాడు. టీవీ మ్యూట్ తీసేశాడు. ఏవో కమ్మర్షియల్స్ వస్తున్నాయి.

కాసేపటికి యాంకర్ చివరి ప్రశ్న అడిగాడు. అవార్డ్ గ్రహీత ఎవరో తేల్చే ప్రశ్న. అదేమిటో వినిపించలేదు. శర్వాణి, ఆరోగ్యం కోసం అతని ఆహారనియమాలను ఖచ్చితంగా ఎలా అమలు చేస్తుందో చెప్పింది. ఐస్క్రీం తింటాడేమోనన్న భయంతో ఒక్కోసారి ఫ్రిజ్ కు తాళం

వెయ్యాల్సి వస్తుందని చెప్పి సభికుల్ని నవ్వించింది. "జీవితంలో కమిట్మెంట్ అనేది ముఖ్యమనీ, భార్య అనే ఉద్యోగానికి అదెంతో అవసరం. వ్యాపార రంగంలో తిరుగులేని రాజు తనకు మాత్రం శ్రద్ధగా చూసుకోవాల్సిన పసి పిల్లవాడితో సమానం" అన్నది.

భార్య మాట్లాడుతుంటే చూస్తూ, భోజనం చేశాడు.

నిబద్ధతతో శ్రమించేవారికి , దారిలో విజయమనే విడిది ఎదురవుతుంది. అతని తోటి ప్రయాణికులు , ఆ విడిది తమదేనంటారు. పరుగుతీసే వాడికి వేగం మీదే ధ్యాస తప్ప విజయాలు పట్టవు. ఆ విజయాన్ని ఎవరు స్వంతం చేసుకుంటున్నారన్న విషయమూ ముఖ్యం కాదు.

'విజయం వెనుక స్త్రీ' అవార్డ్ పట్టుకుని శర్వాణి ఇంటికొచ్చేసరికి ప్రకాష్ రిక్లైనర్ లో నిద్రపోతున్నాడు. ఎదురుగా టీవీ చిన్న గొంతుతో అల్లరి చేస్తోంది.

టీవీ ఆపేసింది. నిశ్శబ్దానికి నిద్రలేచాడు.

"ఇక్కడ పడుకున్నావేం, ప్రకాష్?"

"నిద్ర పట్టేసింది. ఎంత సేపైంది వచ్చి."

మాట్లాడకుండా అవార్డ్ చేతిలో పెట్టింది.

'నీకా అర్హత ఉంది' అని అర్థం వచ్చేలా ఇంగ్లీషులో చెప్పాడు . చిన్నగా నవ్వింది. బెడ్ రూం లోకి వెళ్ళి దిండు కానుకుని బుక్ ఒకటి పట్టుకున్నాడు.

ఆమె అవార్డ్ ఫంక్షన్ బట్టలు మార్చుకుని లోపలికి వచ్చింది.

"ప్రకాష్, ఒక మాట చెప్పాలి." కాళ్ళ వైపు కూర్చుంది.

కాళ్ళు ఆమెకు తగులుతున్నాయని కొద్దిగా ఎడంగా పెట్టాడు.

"చెప్పు."

"అదే, సరోగేట్ కోసం చూస్తున్నానని చెప్పానుకదా. ఒకమ్మాయి దొరికింది. మా చుట్టాలమ్మాయే. దూరపు బంధువులవుతారు."

"అలానా?"

ఒకరి ఆలోచనలు ఒకరు పంచుకునే చనువు లేదు కానీ, వాళ్ళెలా ఆలోచిస్తారో పసిగట్టే నేర్పు ఇద్దరికీ ఉంది.

"ప్రకాష్, నువ్వు కో ఆపరేట్ చెయ్యాలి. ప్లీజ్."

"అలాగే"

"అలాగే అంటే కాదు. మంచి ఆహారం, నిద్ర ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రయాణాలు తగ్గించుకోవాలి. సాంపుల్స్ లో క్వాలిటీ ఉండాలి కదా."

మౌనంగా చూస్తున్నాడు.

"ఈ ప్రాసెస్ లో కొన్ని రూల్స్ ఉన్నాయి."

"చెప్పు"

"ఆమె ఎవరు, ఏమిటి అన్న వివరాలు అడగకూడదు. నాకు తెలియకుండా ఆమె ఎవరో తెలుసుకోవాలని, కలవాలని ప్రయత్నించకూడదు. "

"ఆ డిటైల్స్ మీద నాకు ఇంట్రెస్ట్ లేదు."

"కనీసం పిల్లల మీద ఉందికదా, ఇంట్రెస్ట్."

"అది కూడా నీకోసమే. నీకు కావాలి గనక, నాకిష్టం. అంతే."

చదువుతున్న పుస్తకం మూసేశాడు.

కృత్రిమ పద్ధతుల ద్వారా ప్రెగ్నన్సీ కోసం చేసే రెండో రెండో ప్రయత్నంలో మధురకు గర్భం వచ్చింది.

మూడోనెలలో ఆమె పిండం అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉందని తెలిశాక, ఆమెను ఊరి చివర్న ఉన్న పెద్ద భవంతి లాంటి గెస్ట్ హౌస్ కు మార్చారు.

రోజు వారీ దిన చర్య ఒక పద్ధతి ప్రకారం సాగేది.

మధురకు ఎక్కువగా రాత్రిపూట చదివే అలవాటు. చదవడానికేమీ బుక్స్ లేకపోయినా ఆమెకు రాత్రి రెండు మూడింటి వరకూ నిద్రపట్టేది కాదు.

ఉదయాన్నే కేర్ టేకర్ నిద్రలేపింది.

అప్పుడు లేవాలంటే కళ్ళు తెరుచుకోలేదు.

"ఏమిటి?" అడిగింది.

"అమ్మా, అయిదయింది. మేడం ఫోన్ చేశారు."

"అలాగే." అంటూ లేచింది

ఉదయం అయిదింటికి యోగా ట్రెయినర్ వచ్చేది. మెడిటేషన్ హాల్లో కూర్చుంది. ఆలోచనలన్నీ పుస్తకాల వైపే పోతున్నాయి. ఇంకా ఎన్నాళ్ళుంది తన మెయిన్ ఎగ్జామినేషన్. మనసు నిలవడం లేదు. ఇష్టమైన విషయం పట్లే ధ్యానం. ఇంత మంచి పరిసరాల్లో కూర్చుని చదువుకుంటే , ఎంత బాగుంటుంది. చదవాలి. చదవాలి.

యోగా , మెడిటేషన్ తర్వాత ప్రశాంతతకోసం, టీవీలో ప్రవచనాలు వినాలి. ఆమెకు తోడుగా నర్స్, వంట మనిషి, డైటిషియన్, కేర్ టేకర్ అందరూ కూర్చునేవారు. కాటన్ చీర కట్టుకుని ఒకామె మైక్ ముందు కూర్చుని కాసేపు భజన చేసింది. భజన తర్వాత బోధ! ఆమె చెప్పే నీతి వాక్యాలు వింటే, గతి తప్పిన ఆలోచనల్ని, సరి అయిన మార్గంలో పెట్టుకోవచ్చు.

మధుర మనసక్కడ లేదు. 'తను పరీక్షకు ప్రిపేర్ అయితే ఎంత బాగుండు. ఇలాంటి ప్రశాంత వాతావరణం మళ్ళీ వస్తుందా. చక్కటి గార్డెన్. తోటలో తిరుగుతుంటే చాలా బాగుంది. అక్కడ తన బుక్స్ అన్నీ పెట్టుకుని, నోట్స్ రాసుకుంటూ, చదువుకుంటూ ఉంటే?' కలల్లో తేలిపోతోంది.

జరగని వాటిని కలల్లో ఊహించుకుని సంతోషపడడానికే కదా మనసున్నది.

నీతిబోధ అయ్యాక బ్రేక్ ఫాస్ట్ తినాలి. డైటీషియన్ చెప్పిన ప్రకారమే మెనూ ఉండేది. అందులో ఆమె తినగలిగినవేమీ ఉండేవి కాదు.

చుట్టూ నిలబడి చూస్తున్న పనివాళ్ళు.

టేబిల్ మీద ఉడకబెట్టిన గుడ్లు, పనీర్, బ్రోకలీ ఎన్నో రకాల జ్యూసులు, సలాడ్ లు, నట్స్, తక్కువ మసాలాతో వండిన మాంసం, బోను సూప్ లాంటివి ఉండేవి.

ఆమెకవి అలవాటు లేక తినలేకపోయేది.

తినడానికి భయపడి “నాకు ఆకలిగా లేదు.” చెప్పింది.

“మీరు తినకపోతే మేడం కోప్పడుతున్నారు.” డైటిషియన్ మెల్లగా అంది.

తినడానికి ప్రయత్నించి వాంతులు చేసుకునేది.

రెండు మూడు వారాలకొక సారి డాక్టర్ ని వెంట బెట్టుకుని వచ్చేది శర్వాణి. ఒక సారి ఆమెను పరీక్ష చేసి ,తిరిగి వెళ్ళేటపుడు “ఎలా ఉంది మా మధు?” అడిగింది శర్వాణి.

“బాగానే ఉంది. కానీ బరువు పెరగడం లేదు.”

“కారణం ఏమైయ్యుంటుంది?”

“ నిద్ర కూడా సరిగా పోతున్నట్టు లేదు. ప్రొఫెషనల్ కౌన్సెలర్ తో అపాయింట్మెంట్ ఒకటి అరేంజ్ చేస్తాను.”

శర్వాణి ఆలోచనలో పడింది. విషయాలన్నీ తెలిసింది డాక్టర్ కే. కొత్తగా కౌన్సెలర్ మధురని కలవడం, విషయాలు బయటికి రావడం అంత మంచిది కాదనుకుంది.

“డాక్టర్, మొదటి నుండీ మీరే చూస్తున్నారు. రోజుకు కొంత టైం మీరే తనతో గడిపే వీలు చేసుకోవచ్చు కదా. కొన్ని నెలల పాటు, హాస్పిటల్ లో మీ డ్యూటీస్ తగ్గించే ఏర్పాటు చేస్తాను.”

“అదేమీ అవసరం లేదు. నాకు వీలైనపుడు తనని బయటికి తీసుకువెళ్తాను. ఎక్కువగా నాకు టైం దొరికేది హాస్పిటల్ కు వెళ్ళే టైంలో. ఎంత ట్రాఫిక్ ఉంటే అంత ఎక్కువ మాట్లాడొచ్చు. వీకెండ్స్ లో మీకేమీ అభ్యంతరం లేదు కదా?" శర్వాణిని అడిగింది డాక్టర్.

"అంతకన్నా ఏంకావాలి." సంతోషంగా ఒప్పుకుంది.

వారాంతంలో డాక్టర్ తనతో బాటు మధురను బయటికి తీసుకుని వెళ్తుండేది.

ఆమెకు సౌకర్యంగా ఉండేట్టు సీటుని సరిచేసింది. సీట్ బెల్ట్ వత్తుకోకుండా పెట్టింది. పెడుతున్నపుడు చిన్నగా “చక్కిలిగిలిగా ఉందా?” నవ్వుతూ అడిగింది.

మధురకు కూడా నవ్వొచ్చింది. లేదన్నట్టు తలూపింది.

“రోజంతా ఏం చేస్తుంటావు? ఎలా తోస్తుంది నీకు.”

“ఏమీ లేదు. తినడం , పడుకోవడం. రొటీన్.”

“ఒక వేళ ఈ ప్రెగ్నన్సీ రాకపోతే, ఏం చేస్తుండేదానివి?”

ఆమె ఏమీ మాట్లాడలేదు. చెప్పడం ఇష్టం లేనట్టు మౌనంగా ఉంది.

“కార్ డ్రైవింగ్ వచ్చా మధురా నీకు?”

“వచ్చండీ. నేర్చుకున్నాను.”

యాధాలాపంగా మాట్లాడుతున్నట్టు మధుర ఇష్టా ఇష్టాలన్నీ అడిగి తెలుసుకుంది.

చాలారోజుల తర్వాత బయటి ప్రపంచం చూస్తోంది ఆమె. ప్రెగ్నన్సీ గురించి కాకుండా మిగిలిన విషయాలే మాట్లాడుతోంది డాక్టర్.

డాక్టర్ చెప్పే విషయాలు వింటుంటే, ఆమెకు పనిలో ఆనందం పొందడం తెలుసని అర్థమవుతుండేది. పేషంట్ తో మాట్లాడడమూ, వాళ్ల పిల్లల్ని ముద్దు చెయ్యడమూ ఖాళీ సమయాల్లో నర్సులతో కలిసి నవ్వుకోవడమూ అన్నీ ఇష్టమే. ఆమెతో గడపడం చాలా బాగుండేది మధురకు. వీకెండ్ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసేది.

ఓ రోజు ఆదివారం హాస్పిటల్ కు ఏదో ఎమెర్జెన్సీ కేస్ వుందని తీసుకెళ్ళింది. డాక్టర్ ఆపరేషన్ చేసే టైం లో డ్యూటీ రూంలో కూర్చోబెట్టింది. అదొక చిన్న రూం.

ఒక పక్కన బెడ్, వేరే టేబిల్ మీద ఆమె బుక్స్ ఉన్నాయి. బుక్స్ తీసి చదువుతుంటే, లంచ్ టైం కి డాక్టర్ వచ్చింది.

“భోజనం చేద్దాం రా.” అంటూ ఆ రూం లోనే ఆమె తెచ్చిన స్టీల్ కారియర్ విప్పింది.

‘బెండకాయ కూర. బచ్చలి కూర పప్పు, ఎన్నాళ్ళకు చూశాను.’ అనుకుంటూ చూస్తోంది.

“ఆకలి వేస్తోందా?”

అవునన్నట్లు తలూపింది. ఒక ప్లేట్ లో అన్నం, కూరా వేసి ఇచ్చింది.

మర్నాడు రాత్రి, శర్వాణి డాక్టర్ కు ఫోన్ చేసింది.

" ఏమైనా చెప్పిందా మా మధూ?"

"నిన్న నాతోనే లంచ్ చేసింది. చక్కగానే భోంచేసింది. అలవాటు లేని ప్రపంచం. తోడు లేకపోవడం వల్ల ఏమీ తినడంలేదని తెలుస్తోంది."

"ఇంకా ఏమిటి తన సమస్య"

" పనేమీ లేకుండా ఉండడం కూడా. ఆ అమ్మాయికి బుక్ రీడింగ్ ఇష్టం. బుక్స్ లేకపోవడం వల్ల బాధపడుతోంది."

"అయితే తనకేం బుక్స్ కావాలో అన్నీ తెప్పించండి."

మధురకు కావలసిన బుక్స్ అన్నీ అమిరాయి. ఆమె సంతోషానికి అంతులేదు.

ఏడో నెల వచ్చాక ఓ సారి ఓ రోజు శర్వాణి వచ్చేసరికి తెల్లని కాటన్ చీర కట్టుకుని ఎదురొచ్చింది. చూసేందుకు నిండుగా ఉంది.

“చాలా థాంక్సక్కా. మీదెంతో గొప్ప మనసు.” ఆనందంగా చెప్పింది.

శర్వాణి డాక్టర్ కు ఫోన్ చేసి ప్రత్యేకంగా థాంక్స్ చెప్పింది. "ఇక నుండీ పూర్తిగా మీదే బాధ్యత. మధుని జాగ్రత్తగా చూసుకోండి.రెగ్యులర్ గా టచ్ లో ఉండండి.” అంటూ డాక్టర్ కు చెప్పింది.

ఒక రోజు మధురను చూసేందుకు శర్వాణి ఒక్కతే వచ్చింది. అప్పటికి మధుర ఇంట్లో లేదు.

పనివాళ్ళను అడిగితే డాక్టర్ తో కలిసి ఎక్కడికో వెళ్లిందని చెప్పారు.

మధ్యాహ్నం పూట ఎక్కడికి వెళ్ళారు అనుకుంటూ కాసేపు పచార్లు చేసింది. గంటవుతున్నా రాలేదు. డాక్టర్ కి ఫోన్ చేద్దామనుకుంటూ కిటికీ నుండి బయటికి చూసింది. మధుర ఆటోనుండి దిగుతోంది.

‘ఆటోలో ఎక్కడికి వెళ్ళి వస్తోంది. డెలివరీ డేట్ ఇంకా రెండు నెలలు కూడా లేదు?’ శర్వాణికి అంతులేని కోపం వచ్చింది.

లోపలికి వచ్చాక శర్వాణిని చూసి వణికి పోయింది మధుర. ఆమె ఉదయం సరిగా తినకుండా వెళ్ళింది. నీరసంగా ఉంది. చెమటలు ధారగా తలనుండి కారుతున్నాయి.

“ఎక్కడికెళ్ళొస్తున్నావ్? ఎవరైనా స్నేహితులున్నారా?” శర్వాణి అడిగే తీరులో ఆమెకెంత కోపం వచ్చిందో అర్థమైపోతోంది.

“అదీ. ఎగ్జాం ఉంటేనూ. ఇవాళే లాస్ట్.”

"పరీక్షలు రాస్తున్నావా? వద్దన్నానుగా. ఫీజెవరు కట్టారు నీకు?” మెత్తగా అంటున్నా మాటల్లో పదును.

మధుర మాట్లాడలేదు.

“చెప్పూ.”

“ డాక్టర్”

శర్వాణి దగ్గరకొస్తోంది.

“డాక్టర్ గారిని ఏమీ అనొద్దక్కా. ప్లీజ్.” నిలువునా వణికి పోతోంది. ఆమె చేతిలో ఉన్న బాగ్ విసురుగా లాక్కుంది. ఆ విసురుకి , మధుర తూలి పక్కనే ఉన్న టేబుల్ కోణం మీద పడిపోయింది.

పొట్టకు తగిలింది. నొప్పితో నేలమీద పడిపోయింది. పని వాళ్ళొచ్చి ఆమెను లేపి సోఫాలో కూర్చోబెట్టబోయారు. పడుకున్న చోటి నుండి లేవలేనని సైగ చేసింది. కొన్ని నిముషాల తర్వాత మెల్లగా ఆమెను నడిపించి బెడ్ రూం లోపలికి తీసుకెళ్ళారు.

బాగ్ లో ఏమున్నాయో చూసింది శర్వాణి. సివిల్స్ హాల్ టికెట్, కొంత చిల్లర కనిపించాయి. పరీక్షల హాల్ టికెట్ చూసింది. అయిదురోజుల పాటు జరిగిన పరీక్షలు. అదే చివరిరోజు .

శర్వాణి ఆలోచిస్తోంది. అయిదు పేపర్లు. ఎవరో సహాయం చేయకపోతే , అన్ని రోజులు తనకు తెలియకుండా

“రోజూ ఎక్కడికివెళ్తోంది?” కేర్ టేకర్ని అడిగింది.

“డాక్టరమ్మగారే రోజూ వచ్చి తీసుకెళ్తున్నారు. దిగబెడుతున్నారు. ఇవాళెందుకో మరి రాలేదు. డాక్టర్ గారే కదా అని మేమూ అడ్డు చెప్పలేదు.”

డాక్టర్ మీద కోపం, అసహ్యం ముంచుకొచ్చింది .

‘ఇప్పుడు ఎనిమిదోనె నెల.

ఎంత ఖర్చు, ఎంత శ్రమ, ఎన్ని జాగ్రత్తలు?

ఏదైనా జరిగితే? ఎంత అలక్ష్యంగా ఉంటారు. చిల్లర మనుషులు.’

శర్వాణి అసహనం అంచులు దాటుతోంది.

నర్స్ లోపల్నుండి బయటికి వచ్చి

“మేడం, ఒక సారి లోపలికి వస్తారా?" పిలిచింది.

లోపలికి వెళ్ళి చూస్తే మధుర పరిస్థితి కంగారుగా ఉంది.

ఊపిరి తీసుకోలేక అవస్థ పడుతోంది.

మధుర పడుకున్న బెడ్ మీద పరచిన తెల్లని బెడ్ షీట్ వేరే రంగులోకి వేగంగా మారుతోంది.

చూడలేక కళ్ళు మూసుకుంది.

డాక్టర్ కు ఫోన్ చెయ్యబోయి ఆగింది.

ఏమని చెప్తుంది. ఇప్పటి వరకూ బాగానే ఉన్న మనిషికి , హఠాత్తుగా ఎనిమిదో నెలలోనే నొప్పి రావడం, రక్తం పోవడం. ఆమెకు తప్పకుండా అనుమానం వస్తుంది. పైగా మధురకూ , డాక్టర్ కూ స్నేహం కలిసింది.

కొన్ని విషయాలు ఎవరికి తెలియకూడదనుకుంటామో వాళ్ళకే చెప్పాల్సి వస్తుంది. ఫోన్ చెయ్యక తప్పలేదు.

క్షణాల్లో ప్రకాష్ అక్కడికి వచ్చాడు. అంబులెన్స్ కూడా చేరుకుంది.

కళ్ళు తెరిచి చూసింది. హాస్పిటల్ వాతావరణం. జరిగినవి గుర్తొచ్చాయి.

మంచం మీద పడిపోవడం , నొప్పి!

ఇంకా కడుపులో నొప్పిగానే ఉందేమిటి? ఒక సారి తడిమి చూసుకుంది. పొట్ట ఎత్తుగా లేదు. డ్రెస్సింగ్ చేతికి తగిలింది. ఆపరేషన్ అయిందా?

ఆపరేషన్ అయిందంటే, మరి బిడ్డ?

చుట్టూ చూసింది. ఎక్కడా లేదు.

నొప్పి ఎక్కువైంది.

చుట్టుపక్కల ఎవరో ఉంటారన్న నమ్మకంతో “నొప్పి గా ఉంది” అని చెప్పింది.

తనకే వినబడనంత చిన్నగా వుందేం తన గొంతు? పక్కనే కూర్చున్న నర్స్ వచ్చి, బెడ్ షీట్స్ సరిచేసి, చేతికి ఇంజెక్షన్ చేసింది.

“దాహం” అంటే కొద్దిగా మంచినీళ్ళు తాగించింది. మొత్తం తాగబోతుంటే,

"ఎక్కువ తాగకండి. వాంతి అవుతుంది.” నర్స్ ఆపేసింది.

నొప్పి తగ్గింది. తగ్గినట్టే తగ్గి మళ్ళీ వస్తోంది. ఏమిటింత నొప్పి?

నిద్ర లోకి జారుకుంది.

మర్నాడు ఉదయం ఎంతో తేలికగా ఉంది. ఆమెను లేపి, దిళ్లకు ఆనించి కూర్చో బెట్టారు.

నర్స్ మౌనంగా వళ్ళంతా తుడిచింది. బట్టలు మార్చింది. హాస్పిటల్ గౌన్ తేలికగా హాయిగా ఉంది . కడుపులో ఏమీ లేనట్టుంది.

బిడ్డ కోసం చుట్టూ చూసింది.

“బేబీ ఎక్కడా?” నర్స్ ని అడిగింది.

ఆమె ఒక సారి మధుర వంక చూసి మాట్లాడకుండా తన పని చేసుకుంటోంది.

‘ఏమైనా అయిందా బేబీకి.’

“క్షేమమే కదా.”

మళ్ళీ అడిగింది. నర్స్ జవాబు చెప్పలేదు.

బహుశా మాట్లాడకూడదేమో. ఇంక ఏమీ అడగలేదు.

నీళ్ళు తెచ్చి తాగించింది. కాసేపటికి గది బయటకు తీసుకెళ్ళి నడిపించింది.

పాపో, బాబో? ఎవరయ్యుంటారు. ఎలా ఉండి ఉంటారు. ప్రమాద వశాత్తు ఏమైనా అయిందా?

ఇందాకటి నర్స్ వచ్చి, ఒక బ్రెస్ట్ పంప్ , బాటిల్ ఇచ్చింది. ప్రతి రెండు మూడు గంటలకూ నర్స్ పాలు తీసుకెళ్తోంది. అంటే, బిడ్డ క్షేమమే నన్న మాట.

ఆమె కోలుకున్నాక ఇవాళ డిశ్చార్జ్ చేస్తున్నాం అని చెప్పారు. తను అప్పటి వరకూ ఉన్న గెస్ట్ హౌస్ కు వెళ్తున్నానని అనుకుంది. కానీ శర్వాణి వాళ్ళ ఇంటికి తీసుకొచ్చారు.

ఆమెకు ఎదురుపడగలదా?

లోపల భయంగా అనిపించింది.

ఎదురు పడాల్సిన అవసరం రాలేదు. ఇంటికి దూరంగా కనిపిస్తున్న స్టాఫ్ క్వార్టర్స్ ముందు కారు ఆగింది. చిన్న ఇల్లులా కనిపిస్తోంది. వెంట వచ్చిన నర్స్ ఆమెను లోపలికి తీసుకువెళ్ళింది. అదొక చిన్న గది మాత్రమే. పైన తెల్లటి ఫాన్. చెయ్యి ఎత్తితే అందుతుందేమో అన్నంత దగ్గరగా ఉంది. ఒక పక్కనే చెక్క మంచం. సన్నటి పరుపు ,దుప్పటివేసి ఉన్నాయి. నర్స్ ఆమె సామాన్లన్నింటినీ లోపలికి తెచ్చింది. తినడానికి ప్లేటు, గ్లాసు ఇంకా రోజువారీ సామాన్లు తలుపులేని అల్మైరా అరల్లో సర్దింది.

గోడకున్న దణ్ణెం మీద ఆమె బట్టలు వేసింది.

"వెళ్ళొస్తానమ్మా" అంటూ వెళ్ళిపోయింది.

కిటికీ లోంచి చూసింది మధుర. దూరంగా శర్వాణి బంగళా కనిపిస్తోంది. కిటికీ పక్కనే ఏవో పిచ్చి చెట్లు ఉన్నాయి. ఉక్కగా ఉంది. ఫాన్ స్విచ్ వేసింది. పెద్ద చప్పుడుతో తిరుగుతోంది. అయినా చెమట ధారగా కారుతోంది.

ఇక్కడ ఎన్నాళ్ళుండాలి?

ఎందుకుండాలి? అన్న ప్రశ్నకు అరగంటలో సమాధానం దొరికింది.

బంగళాలో పనిచేసే యూనిఫాం చీరకట్టుకున్న ఒక అమ్మాయి “పాలు కావాలి.” అంటూ బాటిల్ తో వచ్చింది.

“పాపా? బాబా?” అడిగింది.

మధుర అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పకుండా,

“బిడ్డకు ఆకలి గా ఉంది. త్వరగా ఇవ్వండి పాలు." ఆ మాట సరిపోయింది, బాటిల్ నిండడానికి.

టైం ప్రకారం బలమైన ఆహారం వచ్చేది. పాలు పడాలంటే నీళ్ళెక్కువ తాగాలని చెప్పేవారు.

నీళ్ళ బాటిల్స్ రూం నిండా సర్ది ఉంచారు.

కొన్ని నెలల తర్వాత, ఓ రోజు బంగళాలో పెద్ద ఎత్తున ఫంక్షన్ ఏదో జరిగింది. బంధువులు , స్నేహితులు కాబోలు , మనుషులతో సందడిగా ఉంది. హడావుడి తెలుస్తోంది. ఆ రోజు మధురకు కూడా విందుభోజనం పంపించారు.

పాల అవసరం తీరింది.

మర్నాడే, ఆమె కోసం ఒక ఆటో వచ్చింది.

వేరే రాష్ట్రం లో ఒక చిన్న ఊరిలో ప్రకాష్ కు బట్టల మిల్లులున్నాయి. ఎంతో మంది కార్మికులు పని చేస్తుంటారు. ఊరిలో బతికే వారంతా ఆ మిల్లు వర్కర్లే. చుట్టు పక్కల మరెంతో మంది వేరే వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నారు. మిల్లు వర్కర్లందరికీ ఇళ్ళు కట్టించి ఇద్దామని ఒక ప్రాజెక్ట్ మొదలెట్టాడు. ఇళ్ళు కడుతున్న సమయం లో ఆ మిల్ చుట్టుపక్కల పనిచేసే చిన్న చిన్న వ్యాపారస్థులంతా వచ్చి, తమకు కూడా ఏదో న్యాయం చెయ్యాలన్నారు. ఎంతో కొంత తక్కువలో ఇళ్లు నిర్మించి ఇవ్వమనీ, ఎలాగోలా తీర్చుకుంటామనీ అడిగారు. వెయ్యి ఇళ్ళు పూర్తి అయ్యాయి. మరో యాభై అరవై ఎక్కువకాదుకదా అని వాళ్ళక్కూడా నిర్మించి ఇచ్చాడు.

ఆ కాలనీ ప్రారంభోత్సవానికి మంత్రి గారిని పిలిచాడు. మంత్రి గారితో బాటే కలెక్టర్ హోదాలో మధుర కూడా వచ్చింది. ఇద్దరికీ పరిచయం లేదు. ఎప్పుడో ఒక సారి ఆమెను చూశాడు ఆమెకు ఆపరేషన్ చెయ్యబోయే ముందొక సారి ఆంబులెన్స్లో ఎక్కిస్తుంటే, దూరం నుండి చూశాడు కానీ ఇద్దరూ ఒకరినొకరు గుర్తించే అవకాశం లేదు.

స్టేజి మీద ఉన్న వారెవరో, తెలుగు అమ్మాయే నని పరిచయం చేశారు.

మాటల మధ్యలో "పోస్టింగ్ మన తెలుగు రాష్ట్రాలలో వేయించమంటారా?" కనుక్కున్నాడు.

"వద్దండీ. ఎక్కడైనా మనుషులేగా." చిరునవ్వుతో చెప్పింది.

ఆమె నవ్వు, మొహం చూస్తే ఎంతో పరిచయంగా అనిపించాయి.

ఫంక్షన్ అయిపోయాక మంత్రిగారితో కలిసి వెళ్ళిపోయింది.

ప్రకాష్ బస చేసిన గెస్ట్ హౌస్ అక్కడికి దగ్గరే.

కార్లో వెళ్తున్నపుడు పియ్యేతో అన్నాడు. "సతీష్, ఈ కలెక్టర్ మేడం తెలుగు వాళ్లేనట."

సతీష్ ఏమీ మాట్లాడలేదు.

"ఎక్కడో చూసినట్టు లేదూ? నీకు తెలియని వాళ్ళుండరు కదా."

సతీష్ మౌనంగానే ఉన్నాడు.

ఎప్పుడూ మాట్లాడుతుండే సతీష్ మౌనంగా ఉండడం ఏమిటీ?

తను అడుగుతున్నా జవాబు చెప్పకుండా ఉండే అలవాటతనికి లేదు.

గెస్ట్ హౌస్ కు త్వరగానే చేరుకున్నారు.

కార్లో ఉన్న బ్రీఫ్ కేస్ తెచ్చి లోపల పెట్టాడు సతీష్.

బాల్కనీ లో నిలబడి ఉన్నాడు ప్రకాష్ తో చెప్పాడు.

"వెళ్తున్నాను సార్."

"టీ తాగి వెళ్ళు."

"పర్లేదు సార్."

"పోనీ నాకైనా తెచ్చి ఇవ్వు." లోపలకెళ్ళి టీ తీసుకుని వచ్చాడు.

"మనిషిని చూస్తే బాగా పరిచయమైనట్టే అనిపిస్తోంది. గుర్తు రావట్లేదు. మతిమరుపు ఎక్కువైంది." మధుర గురించి అనుకుంటూ ప్రకాష్ టీ తాగుతుంటే తల వంచుకుని నిలబడ్డాడు సతీష్.

"మాట్లాడవేం సతీష్? అందర్నీ బాగా గుర్తుపెట్టుకుంటావుగా."

మనకేదైనా పని చేసిపెట్టారా ఈ కలెక్టర్ గారు?"

"సార్." చెప్పడానికి సందేహిస్తున్నట్టు అన్నాడు.

"పర్లేదు చెప్పు. ఎప్పుడైనా హెల్ప్ చేశారా"

"చేశారు సార్. బిజినెస్ విషయాల్లో కాదు. కానీ మేడం ఈ విషయం మర్చిపోవాలని చెప్పారు"

తనెందుకు చెప్పవద్దంటుంది? విచిత్రంగా ఉంది.

"సరే సతీష్, వెళ్ళు" కళ్ళు మూసుకుని వెనక్కి వాలాడు. శర్వాణి వద్దన్న విషయం పనివాళ్ళనడగడం ఇష్టం లేదతనికి.

కాసేపాగి కళ్ళు తెరిస్తే, సతీష్ అక్కడే నిలబడి ఉన్నాడు.

"వెళ్ళలేదా?" అన్న ప్రశ్నకు జవాబుగా

"ఆ రోజున ఏంబులెన్స్ లో తీసుకెళ్ళి ఆపరేషన్ చేయించిన అమ్మాయి , ఈ మేడం గారే!"

"నిజమా?" వెనక్కి వాలి పడుకున్న అతను, గభాల్న లేచి కూర్చున్నాడు.

ఆ అమ్మాయి కలెక్టర్ కావడమేమిటీ?

ఆమె ఎవరో పెద్దగా చదువుకోలేదనీ, పేదరికం లో ఉన్న తమ దూరపు బంధువనీ చెప్పిందే శర్వాణి.

"నీకు ఖచ్చితంగా తెలుసా?"

"ఏంబులెన్స్ లో ఎక్కించే టైంలో నేనూ ఉన్నాను. ఆ తర్వాత అడాప్ట్ చేసుకోక ముందు బర్త్ సర్టిఫికేట్ కూడా నేనే తెచ్చాను. అందులో ఉన్న పేరు ఈ మేడం పేరే. ఈమె , ఆ అమ్మాయే సార్."

అంటే తన బిడ్డకు తల్లి ఈ కలెక్టర్.

ఆరోజు ఏం జరిగిందో, ఎందుకు గొడవైందో వివరంగా చెప్పాడు. పెరుమాళ్ళకైనా, తెలియని విషయాలు పనివాళ్ళకు తెలుస్తాయి. సతీష్ ని ఏ విషయమూ అడగకూడదనుకున్నాడు. కానీ అతను చెప్తుంటే ఆపాలని అనిపించలేదు.

ఆమెకు ఆపరేషన్ అయ్యాక బంగళాకు తీసుకుని రావడం, బిడ్డ పాల కోసమని ఆమెను సర్వెంట్ క్వార్టర్స్ లో ఉంచారనీ, అన్నప్రాసన తర్వాత రోజున ఆటోలో పంపించారనీ చెప్పాడు.

చూస్తుండగానే చీకటి పడింది. కొన్ని నిజాలు వినాలంటే చీకటి అవసరం.

తర్వాత రోజు ఆమె అప్పాయింట్ మెంట్ కోసం ప్రయత్నించాడు. దొరకలేదు.

కొండపక్కనే వాగొకటి పొంగి ఇళ్ళు మునిగిపోతే , సహాయక చర్యలలోసం వెళ్ళిందనీ, ఎప్పుడొస్తుందే తెలియదనీ చెప్పారు.

మూడు రోజుల తర్వాత ఆమె ఆఫీసుకు వెళ్లాడు.

రెండు రోజుల్నుండీ సరైన నిద్రలేదేమో, ఆమె కళ్ళు ఎర్రబడి , అలిసిపోయాయి.

మర్యాదగా రిసీవ్ చేసుకుని కూర్చోబెట్టింది. "చెప్పండి" తన వల్ల జరిగే పని ఏదో ఉండి ఉంటుందని చూస్తోంది.

"మీతో కొంచం మాట్లాడాలి. ఎక్కువ టైం తీసుకోను."

"పర్లేదు"

తేలికగా వ్యాపార లావాదేవీలు చెయ్యగలిగినబిజినెస్ మాన్ కు , మనుషులతో వ్యవహరించవలసి వస్తే కష్టమే.

"ఎలా చెప్పాలో తెలియడం లేదు."

అతను మాటలకోసం వెతుక్కుంటున్నాడు. "మా కుటుంబం వల్ల మీకెంతో అన్యాయం జరిగింది."

అర్థం కానట్టు చూసింది.

"నేను. ఐ మీన్, శర్వాణి నా భార్య."

ఆ బంగళా, ఆ గెస్ట్ హౌస్, ఆ చిన్న రూం , ప్రతి రెండు గంటలకూ పాలు బాటిల్లో నింపడం గుర్తొచ్చాయి.

ఆశ్చర్యం కలిగించే విషయాలు విన్న తర్వాత , స్థిరంగా ఉండడం జీవితం అప్పటికే నేర్పింది.

“అలాగా, నిన్న కలిసినపుడు చెప్పలేదే!”

తనకు కూడా నిన్న రాత్రే తెలిసిందని చెప్పలేకపోయాడు.

“అక్క బాగున్నారా?” అడిగింది.

నవ్వి ఊరుకున్నాడు.

“చెప్పండి, ఏదైనా పనిమీద వచ్చారా?”

“పనేమీ లేదు. మిమ్మల్ని కలవాలనే వచ్చాను. నాన్నగారు బాగున్నారా?”

“లేరు. పోయారు. అప్పుడే. ఓ ఆర్నెల్ల తర్వాత” ముక్కలు ముక్కలుగా సమాధానం ఇచ్చింది.

“అలాగా. సారీ.”

ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు కాసేపు.

కాఫీ తెప్పించింది.

“ఫిల్టర్ కాఫీ. బాగుంటుంది. తీసుకోండి.”

కాఫీ తాగుతూ అడిగాడు.

“ఇక్కడ మీకు తోడెవరు?”

“ఇక్కడ తండా వాళ్ళు మనుషుల్ని ఎంతో ప్రేమిస్తారు. ఎంతో అండగా ఉంటారు.”

“ఇలా అడిగానని ఏమనుకోవద్దు. పెళ్ళి చేసుకున్నారా?”

“పెళ్ళి నాకొక లక్ష్యం అని ఎప్పుడూ అనుకోలేదు సార్.”

“మీ పట్ల ఎంతో పొరపాటు జరిగింది. సరిదిద్దుకోడానికి ఒక్క అవకాశం ఇవ్వండి.”

“పొరపాటని నేనెన్నడూ అనుకోలేదు. అదలా జరిగింది. అంతే! మీరు కూడా మర్చిపోండి.”

లేత వంగ పూవు రంగు చీరలో ఎంతో హుందాగా ఉంది.

మనసున్న జాబిలి లాంటి అమ్మాయి. ఇలాంటి అమ్మాయికి ఎందుకింత అన్యాయం జరిగింది?

“చనువు తీసుకుని ఒక మాటంటాను.”

“చెప్పండి సార్”

“ మీకిష్టమైతే మీ పెళ్ళి జరిపించే అవకాశం మాకివ్వండి. మీకు తగిన వాడిని, యోగ్యుడైన వ్యక్తిని వెతుకుతాను.”

ఎక్కడో కలుక్కుమంది.

“మీకా ఆలోచన వచ్చినందుకు థాంక్స్. కానీ పెళ్ళి వద్దు సార్.”

అతనికి కూడా సంభాషణ పొడిగించాలని అనిపించలేదు.

లేచి నిలబడ్డాడు.

“ఇప్పుడు తను థర్డ్ క్లాస్.”

"ఎవరూ?"

“స్నేహ! ఈ టౌన్ షిప్ కు తన పేరే పెట్టాము. స్నేహ టౌన్ షిప్.”

“అప్పుడు పుట్టింది పాపా?” లోపల అనుకుంటున్నట్టుగా బయటికి అనేసింది.

“ఎవరో కూడా తెలియదా?" ఆశ్చర్యపోయాడు.

ఆమె జవాబు చెప్పలేదు. ఒక నిముషం పాటు అలాగే తలొంచుకుని నిలబడింది. టేబిల్ మీద రెండు బొట్లు జారిపడ్డాయి.

“మీలానే ఉంటుంది. ఎంతో తెలివికలది.”

ఆమె ఊపిరిపీల్చే తీరు మారింది.

ఇంకా బాధపెట్ట కూడదని “సారీ, వెళ్తాను.” అంటూ లేచాడు.

పంపించడానికి కార్ వరకూ వచ్చింది.

“మళ్ళీ చెప్తున్నాననుకోకపోతే, పెళ్ళి ఆలోచన వస్తే నాతో చెప్పడం మర్చిపోకండి. "

కార్ లో కూర్చున్నాక వెళ్ళి పోతూ చెయ్యి ఊపాడు.

మధుర కూడా నవ్వుతూ చెయ్యి ఊపింది.

'ఆ నుదురు, ముక్కు , నవ్వే పెదవులు, అంతా నా పాపే.

నా పాపకూడా పెద్దయ్యాక , తల్లిలాగా కావాలి.'

కారు దూరం అవుతుండగా ఆమెనే చూస్తూ ఉన్నాడు.

బంగారు తల్లి.

నన్ను తండ్రిని చేసిన తల్లి.

కార్ వెళ్ళిపోయాక ఆమె లోపలికి వెళ్ళింది. అప్పటికే ఆమె ఫోన్ కు ఒక ఫొటో వచ్చింది.

రెండు పిలకలు వేసుకున్న బూరి బుగ్గల పాప.

ప్రపంచం చిన్నది.

నిజంగా చిన్నది.

తెలిసిన మనుషులే మళ్ళీ మళ్ళీ కలుస్తుంటారు.

ఇంకా ఇంకా బాగా తెలుస్తుంటారు.

*(వచ్చే నెల మరో కథతో కలుసుకుందాం)*

Post your comments